క్లుప్తంగా

విద్యుత్‌శాఖ ఈఈని కలిసిన నాయకులు


ఈఈను కలిసిన యూనియన్ నాయకులు

చీరాల అర్బన్: చీరాల డివిజన్ విద్యుత్ శాఖ ఈఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కే జాన్ థామస్‌ను మంగళవారం ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సబ్ డివిజన్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈఈకు పూలమాలలు, పుష్ప గుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో వేటపాలెం ఏడీ జె.శ్రీనివాసరావు, వేటపాలెం సబ్ ఇంజనీర్ శ్రావణ్, చీరాల సబ్ ఇంజనీర్ షకీనా, డివిజన్ ప్రెసిడెంట్ వి.విజయకుమార్, సెక్రటరీ జె.కళ్యాణరావు, ట్రెజరీ లైన్ ఇన్‌స్పెక్టర్ సింగయ్య, లైన్‌మెన్లు కె.విజయకుమార్, జి.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకులపై కేసు

పర్చూరు (చినగంజాం): పది మంది జనసేన నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్ చెంచుప్రసాద్ తెలిపారు. మంగళవారం పర్చూరులో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉండగా నూతలపాడు గ్రామానికి చెందిన పది మంది జనసేన కార్యకర్తలు జెండాలతో బొమ్మల సెంటర్‌కు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ధర్నా చేసేందుకు ప్రయత్నించినందుకు వారిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీజే బాక్సులు, యాంప్లిఫ్లయర్లు చోరీ

మార్టూరు: వినాయక చవితి ఊరేగింపుకు వినియోగించిన డీజే బాక్సులు, యాంప్లిఫ్లయర్లు చోరీకి గురైన విషయమై మంగళవారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక బలరాం కాలనీలో నివాసం ఉండే తూపూరు శ్రీనివాసరావు ఆదివారం రాత్రి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఊరేగింపు కోసం 5 డీజే బాక్సులు, 3 యాంప్లిఫ్లయర్లు ఇతర సామగ్రిని ఉపయోగించి ఇంటి ముందు ఖాళీ స్థలంలో ఉంచాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి వరకు ఇంటి సమీపంలోనే ఉన్న సామగ్రి మంగళవారం ఉదయం కనిపించలేదు. బాధితుడు శ్రీనివాసరావు మంగళవారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ.90 వేలకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

వీధి దీపాలు లేక ఇబ్బందులు

పర్చూరు (చినగంజాం): మండలంలోని ఉప్పుటూరు గ్రామం గత రెండు రోజులుగా అంధకారంలో ఉండిపోయింది. వీధి దీపాలు లేక గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు ఉన్నా వీధి దీపాలు వెలిగించడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. రోజు మార్చి రోజు వర్షాలు పడుతున్న తరుణంలో చీకట్లో వీధుల్లో తిరగాలంటే గ్రామస్తులు భయపడుతున్నారు. దీనికి తోడు గ్రామంలో కుక్కలు కూడా ఎక్కువగా సంచరిస్తున్నాయి. వాటి బెడద నుంచి ప్రజలు కాపాడాలని గ్రామస్థులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఈ విషయమై పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పునరుద్ధరిస్తామని సమాధానం ఇచ్చారు.

స్థలాలకు పట్టాలివ్వాలని వినతి


డీటీకి వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీ కాలనీ వాసులు

అద్దంకి రూరల్: ఎస్టీలు నివాసం ఉంటున్న స్థలాలకు పట్టాలివ్వాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని శింగరకొండ పాలెంలో గత 15 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని, గతంలో వారిలో కొందరికి పట్టాలు మంజూరు చేశారని మరికొందరికి పొజిషన్ చూపించి పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అధికారులు నోటీసులిచ్చి వారం రోజుల్లో ఖాళీ చేయాలని చెప్పడం బాధాకరమన్నారు. నోటీసులు వెనక్కితీసుకుని వారికి పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీ కాలనీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, భాద్రపద మాసం, ధనిష్ట నక్షత్రం, త్రయోదశి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య


సముద్రంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


వాడరేవులో ట్రాక్టర్‌లో నుంచి గణేశుడుని నిమజ్జనానికి తీసుకొస్తున్న భక్తులు

● వాడరేవులో ఘనంగా గణేశుడి నిమజ్జనాలు

చీరాల టౌన్: గణపతి బప్పా మోరియా.. బైబై గణేశా అంటూ భక్తులు గణనాథుళ్లని గంగఒడికి చేరుస్తున్నారు. వినాయకచవితి పండుగ పురస్కరించుకుని చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథులు నిమజ్జనాలకు మంగళవారం తొమ్మిదో రోజు కూడా వాడరేవుకు వచ్చాయి. చీరాల, పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నర్సరావుపేట, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను ఊరేగింపుల అనంతరం నిమజ్జనం కోసం వాడరేవు సముద్ర తీరానికి తీసుకువచ్చారు. మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు, సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

పూజలు చేసిన జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి ..


పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి దంపతులు

చినగంజాం: వినాయక చవితి సందర్భంగా కొత్తపాలెం పంచాయతీలోని మూలగాని వారిపాలెంలో వినాయక విగ్రహం వద్ద చినగంజాం జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొనగా ఆమె భర్త మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు కారపు శంకరరెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి


విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం


వినాయక నగరోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం

● ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల: విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం చీరాల మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ అధికారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఈ సత్యనారాయణ, ఎమ్మెల్యే హాజరయ్యారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, విద్యుత్ లైన్లు, స్తంభాల తదితర పనుల నిమిత్తం రూ.9 కోట్లు మున్సిపల్ నిధులను విద్యుత్‌శాఖకు అందించారు. ఈనిధుల్లో ఏమేరకు పనులు నిర్వహించారనే విషయాలపై అధికారులతో చర్చించారు. మున్సిపాలిటీలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు వెచ్చించగా వీటిలో పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళుతున్న ఈఈ సూర్యప్రకాశరావును ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఈఈ కె.జాన్ థామస్, మున్సిపల్ డీఈ ఐసయ్య, ఏడీ శ్రీనివాసులు, వేటపాలెం ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వినాయక నగరోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చీరాల అర్బన్: చీరాల పట్టణంలోని ఎంజీసీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని నగరోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఆర్డీఓ సరోజిని పాల్గొన్నారు. ఎంజీసీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొబ్బరికాయలతో తయారు చేసిన వినాయకుని ప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, పొత్తూరి సుబ్బయ్య, శిఖాకొల్లి వెంకటేశ్వర్లు, శ్రీరాం రాఘవయ్య, శ్రీరాం వేణుగోపాల్, తాతా కుమారస్వామి, కోట శ్రీమన్నారాయణ, చిన్ని లీలాధరరావు, రాము, పోలిశెట్టి వేణు, గుర్రం రాఘవరావు, వేమా బ్రహ్మం, సంకా రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు చీరాలలో 'జగనన్నకు చెబుదాం'

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వుల మేరకు బుధవారం మధ్యాహ్నం చీరాల మున్సిపాలిటీలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ మంగళవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని అన్నీ గ్రామాల ప్రజలకు తమకు ఉన్న సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందించి పరిష్కారం పొందాలన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండల పరిధిలోని అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు. మండలంలోని ప్రజలకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు.

విద్యార్థులు భాషలపై పట్టు సాధించాలి


హాజరైన తెలుగు ఉపాధ్యాయులు

కారంచేడు: విద్యార్థులు ప్రధానంగా తరగతుల్లోని భాషలపై సరైన అవగాహన, పట్టు సాధించేలా ఉపాధ్యాయులు నిరంతర కృషి చెయ్యాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాల్లో మాట్లాడారు. కుంకలమర్రు ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి 50 శాతం మంది ఉపాధ్యాయులకు నిర్వహించారు. స్వర్ణ ఉన్నత పాఠశాలలో కారంచేడు, చీరాల, చినగంజాం, వేటపాలెం మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రాథమిక దశలో వారికి అందించాల్సిన సబ్జెక్టును అందించినట్లయితే వారి ఉన్నత చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా సాఫీగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కాంప్లెక్స్ చైర్మన్‌లు ఎంవీ సుబ్బారావు, పద్మావతి, కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బల్లికురవలో మాట్లాడుతున్న ఎంఈవో-2

బల్లికురవ: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా నూతన విద్యావిధానం ప్రకారం విద్యాబోధన చేయ్యాలని ఎంఈవో 2 కె. రమేష్‌బాబు కోరారు. మంగళవారం బల్లికురవ, కొప్పరపాడు ఉన్నత పాఠశాలల్లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంప్లెక్స్ చైర్మన్‌లు కె. హనుమంతరావు, బీ. శ్రీనివాసరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది, వైద్యులు

కేశవరప్పాడు (కారంచేడు): ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందయమని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని కొడవలివారిపాలెం, కేశవరప్పాడు గ్రామాల్లో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గుండె, ఎముకలు, కీళ్లు, నరాలు, చర్మవైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె ఆపరేషన్లు అవసరమైన వారికి ఒంగోలు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, ఈఎస్‌ఐల ద్వారా కూడా ఉచితంగా నిర్వహిస్తామని హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ, నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్ రామాంజనేయులు, సునీల్, డాక్టర్ రాణి, సిబ్బందిల సహకారంతో సుమారు 375 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చెరువులో విషం కలిపిన కేసుపై విచారణ


చెరువు వద్ద విచారణ చేస్తున్న ఎస్సై సురేష్


చినగంజాం: రొయ్యల చెరువులో విషం కలిపిన కేసులో చినగంజాం ఎస్సై కే సురేష్ మంగళవారం విచారణ చేశారు. స్థానిక రొంపేరు వంతెన వద్ద ఉన్న చెరువుల చెంతకు వెళ్లి వివాదానికి కారణాలను విచారించారు. స్థానికులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు చెరువు యజమాని కుక్కల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

క్విజ్ పోటీలో విద్యార్థికి మూడో బహుమతి


బహుమతి అందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

జే.పంగులూరు: టీసీఎస్ ఆద్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్ట్‌పై జిల్లా కేంద్రమైన బాపట్లలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు జిల్లాలోని 25 మండలాల్లోని 8,9,10 తరగతులు విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్న పంగులూరు విద్యార్థి రాయిణి సాంబశివ మహేష్ జిల్లా స్థాయిలో 3వ స్థానం సాధించాడు. మూడో స్థానం సాధించిన విద్యార్థి మహేష్ డీఈవో చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో మండలంలోని చెరుకూరు నేరెళ్ల సుబ్బయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పిన్నిబోయిన శ్రీమన్నారాయణ విద్యార్థులకు చదువులో మెళుకువలు నేర్పుతూ వారికి విద్య, భవిష్యత్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బెంజిమన్ హనోక్, క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సీనియర్ సభ్యులు కొల్లా శివరామకృష్ణప్రసాద్, పాబోలు వెంకన్న, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ

పర్చూరు (చినగంజాం): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు సాధించవచ్చని.. దీనిపై రైతులకు సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా డీ బ్రీఫింగ్ మీటింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వీ వాణిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం పర్చూరు రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన నిర్వహించారు. డీపీఎం సిబ్బంది విధులు, బాధ్యతలను తెలియజేసి దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం వర్షాలు అనుకూలంగా పడనందున వర్షాభావ పరిస్థితులకు తట్టుకునే పంటల వివిధ మోడళ్లను రైతులకు తెలియజేసి వారు ఆచరించే విధంగా చేయాలని సూచించారు. డ్రాట్ ప్రూఫింగ్ మోడల్, ఎనీటైం మోడల్‌ను తెలియజేశారు. సిబ్బంది రైతులకు అందుబాటులో రైతులను ప్రకృతి వ్యవసాయంలో ఈ క్రాప్ చేయించుకుంటే పంట ఉత్పత్తులు ఎక్కువ రేటుకు అమ్ముకొనుటకు వీలు ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు, ఎంటీలు, యూనిట్ ఇన్‌చార్జులు, మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు హాజరయ్యారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండర్ 17 అథ్లటిక్స్ పోటీలు ఇంకొల్లు మండలంలోని ఎస్‌వీకే పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరు మండలాలు నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో చెరుకూరు ఎస్ఎస్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు టీ గేయ 3000 మీ, 1500 మీ పరుగు పందెంతో ప్రథమ, ద్వితీయ, ఎస్‌కే హసీనా 100 మీ ద్వితీయ, ఎన్ లక్ష్మీసాయి 1500 మీ ద్వితీయ హెచ్ సంజన లాంగ్‌జంప్‌లో ప్రథమ, మహేష్ ద్వితీయ స్థానాలు అండర్ 14, అండర్ 17 విభాగల్లో సాధించి జిల్లా స్థాయికి అర్హత సాధించారు. అదేవిధంగా బూదవాడలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయికి సీహెచ్ యశ్వంత్, చిరంజీవి, తరుణ్, గౌహర్ అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అదే విధంగా ఖోఖోలో ఎస్ ఊసామా, ఎస్‌కే అహ్మద్‌లు ఎంపికైనట్లు జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ డాక్టర్ ఉదయభాస్కరరెడ్డి, బెంజిమన్ హనూక్ తెలిపారు.

ప్రజాప్రతినిధులకు అభినందనలు


ఎంపీపీ, కోఆప్షన్ మెంబర్, మండల కన్వీనర్‌లను అభినందిస్తున్న ఎంపీడీవో, అధికారులు

కారంచేడు: ప్రజాప్రతినిధులకు మండల అధికారుల బృందం అభినందనలు తెలిపారు. ఎంపీపీగా నీరుకట్టు వాసుబాబు బాధ్యతలు తీసుకొని రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీడీవో డీ విజయలక్ష్మి బృందం మంగళవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ, దగ్గుబాడుకు చెందిన కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్‌ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా తిరిగి ఎన్నికయిన దండా చౌదరిబాబును కూడా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీఓ ప్రదీప్‌కుమార్, ఏపీఎం మధుసూదనరావు, కారుమూడి సుబ్బారెడ్డి, కార్యాలయ సూపరిండెంటెంట్ లక్ష్మీనారాయణ, కార్యాలయ సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ ఆరోగ్యం


మార్టూరులో పథకాన్ని ప్రారంభిస్తున్న డీఎల్‌డీఓ సువార్తమ్మ

మార్టూరు: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రారంభించారని బాపట్ల డీఎల్‌డీఓ సువార్తమ్మ అన్నారు. స్థానిక ఆర్‌జేడీ కాలనీలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని స్థానిక అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది కాలనీవాసులకు పరీక్షలు నిర్వహించి అక్టోబరు 3 వతేదీ పంచాయతీ కార్యాలయంలో ఉచితంగా మందులు తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే కృష్ణకుమారి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మీరావలి, ఎంఎల్ హెచ్‌పీ రాహుల్, ఏఎన్‌ఎం వనజ, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు అత్యంత కీలకం

మేదరమెట్ల: పంట నమోదు చేయించుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఏవో శ్రీనివాసరావు అన్నారు. గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ సహాయకులు తమ పరిధిలో ఉన్న రైతులు ఏపంటను సాగు చేస్తున్నారో వాటి వివరాలను ఈ క్రాప్ అప్లికేషన్ ద్వారా నమోదు చేస్తారని ఏవో పేర్కొన్నారు. కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను ఇప్పించడానికి భూ యజమాని పూర్తి సమ్మతితో కార్డులు ఇస్తారన్నారు. ఖరీఫ్ సీజన్ ఈనెల 30వ తేదీతో ముగుస్తున్నందువలన ప్రతి రైతు సాగుచేసిన పంట సాగు వివరాలను విధిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏవో కోరారు.

ఈ కేవైసీ చేయించుకోవాలి..

బల్లికురవ: ఖరీఫ్‌లో పంట సాగు చేసిన రైతులంతా ఈ-క్రాప్ నమోదుతోపాటు ఈ-కేవైసీ చేయించేకోవాలని వ్యవసాయాధికారి ఎస్వీపి కుమారి కోరారు. ఈ నెల 30వ తేదీలోపు రైతులు సాగు చేసిన పంటలన్నింటీని రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏల ద్వారా పంట నమోదు చేయించుకోవాలన్నారు.